ప్రతి సచివాలయంలోనూ స్పందన

మహిళా పోలీసులకు పిటిషన్లు అందజేయొచ్చు

జిల్లా నూతన ఎస్పీ కెకెఎన్. అన్బురాజన్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలు, పోలీసు స్టేషన్లతో పాటు గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని, మహిళా పోలీసులకు కూడా పిటిషన్లు అందజేయచ్చని ఎస్పీ కెకెఎన్. అన్బురాజన్ తెలిపారు. అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా కెకెఎన్. అన్బురాజన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ. అనంతపురం జిల్లా ఎస్పీగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి, డీజీపీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజల సమస్యలేమైనా సరే తన ఫోన్ నెంబర్ 9440796800ఃకు సమాచారం లేదా ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. వెంటనే స్పందించడమే కాకుండా బాధ్యతాయుతంగా సేవలు అందిస్తామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. బ్లూ కోల్ట్స్, రక్షక్, కమాండ్ కంట్రోల్, విభాగాలను బలోపేతం చేసి జరుగుతున్న దొంగతనాలను నియంత్రించే దిశగా కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ ప్రమాదాలను తగ్గించేందుకు వాహనాల తనిఖీ, బ్యారికేడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామని, ఇందుకు ప్రజల సహకారం అవసరమని అయన అన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతామన్నారు. మట్కా, పేకాట, పీడీఎస్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితూ తరచూ రిపీటెడ్ అఫెండర్లు అయితే వారిపై పీడీ యాక్ట్, బహిష్కరణ తదితర చర్యలు చేపడతామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది ఎక్కడైనా అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని, ఆధారాలు ఉంటే సస్పెన్షన్లు ఉంటాయని హెచ్చరించారు. పోలీసు, మీడియా సమన్వయంతో పని చేద్దామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

వినాయకుడికీ తప్పని నీటి కష్టాలు



నీరు లేక ఎండిపోయిన కాలువ

వర్షాభావంతో నిమజ్జనంపై తర్జనభర్జన

కరువు సమయంలో కనిపించని పండుగ సందడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గడిచిన రెండేళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంచి వర్షాలొచ్చాయి. గతేడాది అయితే వినాయక చవితి పండుగ సమయంలో ఎడతెరిపిలేని వర్షాలు పడ్డాయి. దీంతో నిమజ్జనానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా సాగింది.కాని ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. దీంతో పండుగ తరువాత వినాయక విగ్రహాల నిమజ్జనం ఎక్కడా చేయలన్న దానిపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. అనంతపురం నగరంలో వినాయక విగ్రహాల ఏర్పాటు ఏటా పెద్ద ఎత్తున జరుగుతుంది. సుమారు 300లకుపైగానే ఉంటాయి. ఏటా మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువకు నీరొస్తే నగర సమీపంలోని ఈ కాలువలో విగ్రహాల నిమజ్జనం చేసేవారు. కాని ఈసారి ఇప్పటికీ మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువకు నీరు రాలేదు. దీంతో ఎక్కడ విగ్రహాలు నిమజ్జనం చేసే ఏర్పాట్లు చేయాలని అటు నిర్వాహకులు, అధికారులు తర్జనభర్జనలోనున్నారు. దగ్గరలోనున్న శింగనమల చెరువులో నీరున్నప్పటికీ అంతక మునుపు ఏడాది ఇక్కడ విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా చేపలు పెద్దఎత్తున చనిపోయాయి. దీంతో అక్కడ కాకుండా మరోచోట ఎక్కడన్నది ఆలోచిస్తున్నారు. ఇది అనంతపురం నగర పరిస్థితి. చాలా చోట్ల గతేడాది వర్షాలకు ఎక్కడైనా చిన్నపాటి నీరుంటే అక్కడ చేసేందుకు సిద్ధమవుతున్నారు. లేనిచోట ఇబ్బందులు తప్పేలా లేవు.

వీధుల్లోనే సందడి

వినాయ చవితి వచ్చిందంటే ప్రధాన వీధుల్లో విగ్రహాలను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారుతోంది. ఇది పట్టణాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించింది. కొంత మంది యువకులు సంఘాలుగా ఏర్పడి విగ్రహాల ఏర్పాటు చేస్తున్నారు. అది ఈసారి కూడా ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తునే సాగుతున్నాయి. దీంతో ఆయా వీధుల్లో పండుగ సందడి కనిపిస్తోంది. సోమవారం వినాయక చవితి కావడడంతో విగ్రహాలను ఆదివారం పెద్దఎత్తున పట్టణాల నుంచి తీసుకెళ్లారు. దీంతో విగ్రహాలు తరలించే క్రమంలో ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. ఈసారి విగ్రహాల ధరలూ ఆకాశాన్ని అంటుతున్నాయి. విగ్రహాల తయారీకి వాడే ముడిసరుకు ధరలు పెరగడంతో వాటి ధరలను పెంచేశారు. అయినా యువకులు ఉత్సహంతో కొని విగ్రహాల ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల మూడు రోజులకు నిమజ్జనం చేయగా మరికొన్ని చోట్ల ఐదు రోజులకు నిమజ్జనం చేస్తారు.

ఇళ్లలో కానరాని సందడి

ఇళ్లలోకెళ్లే సరికి ఆ సందడి కనిపించడం లేదు. వర్షాభావంతో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు కూడా వీల్లేకుండా ఉంది. ఇప్పటికీ యాభై శాతం మేర సాగవలేదు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులు అంత అనుకూలంగా లేవు. పైగా నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అన్ని రకాల ధరలు కిలో రూ.200లకు చేరువలోనున్నాయి. చక్కెర కిలో రూ.45 ఉండగా, శనగబ్యాళ్లు కిలో రూ.150కిపైగా ఉంది. కంది బ్యాళ్లు కిలో రూ.200 వరకు ఉంది.ఉద్దిబ్యాళ్లది అదే పరిస్థితి. నూనె రూ.150కి దగ్గరుంది. ఇలా అన్ని రకాల నిత్యావసర ధరలు ఎక్కువగా ఉండటంతో పిండివంటలు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఇలా ఇళ్లలో అంతటి సందడి మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.



అమ్మకానికి ఉంచిన వినాయకుడి ప్రతిమలు

జిబిసి వద్ద వైసిపి ఆందోళన

కెనాల్‌కు నీటి నిలుపుదలపై ఆగ్రహం

ప్రజాశక్తి-ఉరవకొండ



నీటిని విడుదల చేస్తున్న రైతులు

ఇరిగేషన్ అధికారులు గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు నీటి విడుదలను తగ్గించడాన్ని నిరసిస్తూ వైసిపి నాయకులు స్థానిక రైతులతో కలిసి ఆదివారం స్థానిక నింబగల్లు జీరో బై జీరో వద్ద ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని గడేకల్, కడదరబెంచి, డోనేకల్, పొలికి, హంచనహాల్‌తో పాటు కర్నూలు జిల్లా చిప్పగిరి మండలంలోని జి.కొట్టల, ఖాజీపురం రైతులతో కలిసి విడపనకల్లు వైసిపి నాయకులు గత శుక్రవారం జిబిసికి నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే జిబిసి అధికారులు శనివారం షట్టర్లను సగం వరకూ తగ్గించారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, హంచనహాల్ సర్పంచి కేశన్న, పొలికి గాజుల చిన్న వెంకటేష్, సునీల్ రెడ్డి తదితరులు వివిధ గ్రామ రైతులతో కలిసి నింబగల్ జీరో బై జీరో వద్దకు ఆందోళన చేపట్టారు. అంతేగాకుండా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి ఫోన్ చేసి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఇందుకు స్పందించిన విశ్వ ఇరిగేషన్ ఎస్ఇతో మాట్లాడి జిబిసికి రావాల్సిన నీటిని వదలాలని ఆదేశించారు. దీంతో స్థానిక అధికారులు ఉన్న రెండు షట్టర్లను ఎత్తి జిబిసి కెనాల్‌కు నీరు విడుదల చేశారు. వై.విశ్వేశ్వర్ రెడ్డికి ,విడపనకల్ వైఎస్ఆర్సిపి నాయకులకు రైతులు కతజ్ఞతలు తెలియచేశారు.

అరటి గెలలు నరికివేత పిరికిపంద చర్య

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు



అరటితోటను పరిశీలిస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

గొల్లపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు అరటి తోటలోని అరటి గెలలు నరకడం పిరికిపంద చర్య అని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గొల్లపల్లి గ్రామానికి చేరుకుని దండుగులు నరికివేసిన అరటి గెలలను జెసి పరిశీలించారు. అనంతరం అనంతరం రామాంజితోపాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పోలీసులు స్పందించి నరికిన వారిపై చర్యలు తీసుకుని తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి మండల యూత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాము, మునిరెడ్డి, శివారెడ్డి, గోవర్ధనరాజు, శ్రీనివాసులునాయుడు, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నార్పల : సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని బి.పప్పూరు, గంగనపల్లి, నార్పలలో నూతన నిర్మించిన గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ క్లినిక్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను సాంబశివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో దేశంలోనే సరికొత్త విప్లవానికి నాంది పలికారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగిటికే చేరుతున్నాయన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు మిద్దె కుళ్లాయప్ప, ఎంపిడిఓ దివాకర్, తహశీల్దార్ హరికుమార్, నార్పల సర్పంచి సుప్రియ, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న సిఎం జగన్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

ఎపిలో నడుస్తున్న పోలీస్ రాజ్యం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాల గొంతుకను నొక్కుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవశ్రీనివాసులు, పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ విమర్శించారు. ఆదివారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో బిజెపి, వైసిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు, పిసిసి మాజీ ప్రెసిడెంట్ సాకే శైలజా నాథ్, టిడిపి అనంతపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌లు తదితరులు హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్ల సీఎం జగన్ వ్యవహరిస్తున్న తీరును అన్ని రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అర్ధరాత్రి పోలీసు పహారాలో అరెస్టు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా గొంతుకను నొక్కుతుంటే తాము తక్కువ కాదంటూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యల పరిష్కరించాలని నినదించే ఉద్యోగులు, కార్మికులు, ప్రజలను, ప్రశ్నించే ప్రతిపక్షాలను గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులకు పాల్పడుతూ నియంత పాలన సాగిస్తున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ నాలుగేళ్ల దాటుతున్నా వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి మార్పు కనబడటం లేదని రాష్ట్రంలో పక్కా పోలీస్ రాజ్యం నడుస్తోందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ధ్వజమెత్తారు. మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి కర్నూల్‌లో ఉన్నా అటు సిఐడి ఇటు పోలీసులు ఏ ఒక్కరు అరెస్టు చేయలేక పోయారన్నారు. అయితే చంద్రబాబును అరెస్టు చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించారన్నారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్టు చేస్తే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని చెప్పిన పోలీసులకు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును అరెస్టు చేస్తే ఆ సమస్య రాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గ పాలనపై రాష్ట్రంలో 26 జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవశ్రీనివాసులు మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలతో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే కుటిల రాజకీయాలకు జగన్ ఒడిగడుతున్నారని విమర్శించారు. ప్రజలు రాబోవు రోజుల్లో జగన్‌ను బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ. స్వామి, మల్లికార్జున, టిడిపి నగర అధ్యక్షులు మారుతి కుమార్ గౌడ్, ముక్తియార్, లక్ష్మీనరసింహ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి సుధాకర్ యాదవ్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

అనంతపురం కలెక్టరేట్ : వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుందామని మంత్రి కెవి.ఉషశ్రీచరణ్, కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్, జిల్లా సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనలో పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణానికి అనుకూలంగా జరుపుకోవాలని, వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ సమష్టిగా కషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి క్షేమ, స్థైర్య ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

చవితి ఉత్సవాల్లో అల్లర్లకు తావివ్వొద్దు : డీఎస్పీ

కళ్యాణదుర్గం : వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం పట్టణంలోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసుకుంటున్న నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ తేజమూర్తి, ఎస్ఐ ఆశాభేగం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖాతాదారుల నమ్మకమే మా భరోసా : జెఎల్ మురళి

అనంతపురం : ఖాతాదారుల నమ్మకమే తమ భరోసా అని అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి, సిఇఒ విజయభాస్కర్ తెలిపారు. ఆదివారం నగరంలోని అర్బన్ బ్యాంకులో 12వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఏర్పడి నేటికి 11 నెలల అయిందన్నారు. ఈకాలంలోనే పాలకవర్గం, సిబ్బంది బ్యాంకు ఆర్థిక అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారన్నారు. ఇకపోతే 2022-23 సంవత్సరం ఆడిట్ నివేదికను ఆమోదించుట, అంచనాకు మించిన ఖర్చులను ఆమోదించుట, బైళా మేరకు నికర లాభాన్ని పంపిణీ చేయడం ఈ మహాసభ ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యాంకు ఎన్‌పిఎ 12.97 శాతం నుంచి 6.19 శాతం వరకూ తగ్గించడంతో సఫలీకృతులమయ్యామన్నారు. ఇది ప్రజల సొమ్ము కావున వారికి కాపలాదారుల్లా మాత్రమే పని చేస్తున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో అనేక సొసైటీలను ఆదరిస్తున్న తరుణంలో అనంతపురం అర్బన్ బ్యాంకు మాత్రం డిపాజిట్ ధరలతోపాటు ఖాతాదారుల నమ్మకాన్ని చూరగొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బోయ కృష్ణకుమార్, డైరెక్టర్లు వడ్డే వెంకటాద్రి, వడ్డే మని, గోల్డ్ బాషా, జంగంశెట్టి రామాంజనేయులు, బిజెపి చంద్రశేఖర్, రోళ్ల భాస్కర్, సుంకర రమేష్, చింతా భాస్కర్, కెఎన్ రాధా, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో రైతు ఆత్మహత్య
వివరాలు మెయిన్‌లో..

పుట్టపర్తిలో మద్యం దుకాణాలు నిషిద్ధం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపరి పరిసర ప్రాంతాలలో మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతులు లేవని శ్రీ సత్య సాయి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ జె. రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తికి ఆదివారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.

ప్రశ్న : శ్రీ సత్య సాయి జిల్లాలో మద్యం షాపులు ఎన్ని ఉన్నాయి ?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 70 మద్యం షాపులకు, 11 బార్లకు అనుమతులు మంజూరు చేశాము. గతంలో వీటికి ఈ యాక్షన్ ద్వారా టెండర్లు పిలిచి లైసెన్స్‌లు మంజూరు చేసాం. మండలంలో రద్దీని బట్టి ఒక్కొక్క చోట ఒకటి, రెండు దుకాణాలకు అనుమతి మంజూరు చేసాం. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతి మంజూరు చేయలేదు. జిల్లాలో ఎవరైనా గొలుసు దుకాణాలు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర : కర్నాటక మద్యం అక్రమ రవాణా పై మీ అభిప్రాయం?

జ : శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని దాదాపు 200 కిలోమీటర్ల మేర కర్నాటక సరిహద్దు ప్రాంతం ఉంది. దీంతో జిల్లాలోకి కర్నాటక మద్యం సునాయాసంగా సరిహద్దులు దాటిస్తున్నారు. అలాంటి వ్యక్తుల పైన గట్టి భద్రత ఏర్పాట్లు చేసి కర్నాటక మద్యాన్ని జిల్లాలోకి ప్రవేశించకుండా అడ్డుకట్ట వేస్తున్నాం. అక్రమ మద్యాన్ని తరలిస్తున్న వారిపై కేసులు బనాయిస్తూ అదే కేసులలో పలుమార్లు పట్టుబడితే జిల్లా బహిష్కరణ చేస్తున్నాం. కర్నాటక సరిహద్దుల నుంచి జిల్లాలోకి మద్యాన్ని తరలించే వ్యక్తులను, వాహనాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి వాటికి అడ్డుకట్ట వేస్తున్నాం.



ప్ర : జిల్లాలో కల్తీ కల్లు అమ్మకాలపై మీ అభిప్రాయం?

జ: ఇటీవల జిల్లాలోని పెనుగొండ, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు తదితర ప్రాంతాలలో కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించి వాటి నాణ్యతను పరిశీలించాం. కల్తీ కల్లు అమ్మే వ్యక్తులపైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే ఎలాంటి వ్యక్తులు నైనా ఉపేక్షించేది లేదు. అలాంటి కల్లు దుకాణాలను సీజ్ చేస్తున్నాం. వారి లైసెన్సులను సైతం రద్దు చేస్తున్నాం. పెనుగొండ, రొద్దం మండలాలలో ఇటీవల కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన ఘటనపై దానికి కారణమైన దుకాణాలపై చర్యలు తీసుకున్నాం.

ప్ర : జిల్లాలో కల్లు దుకాణాలు ఎన్ని ఉన్నాయి, కల్తీకల్లు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా కల్లు దుకాణాలను సొసైటీల ద్వారా నిర్వహిస్తున్నారు. మరికొన్ని ఎక్సైజ్ శాఖ నుండి పర్మిషన్లు పొంది నడుపుకుంటున్నారు. అలాంటివి జిల్లా వ్యాప్తంగా 200కు పైగా ఉన్నాయి. కల్తీ కల్లు అమ్మకుండా ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నాం. కల్తీకల్లు విక్రయిస్తున్నట్లు నిరూపణ అయితే అలాంటి దుకాణాల లైసెన్స్ ను రద్దుచేసి దుకాణాన్ని సీజ్ చేస్తాం. అంతేకాక కల్లులోకి ఎక్కువ మోతాదులో చాక్రిన్, ఇతర మత్తు పదార్థాలు కల్తీ చేస్తే వాటి నాణ్యత పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ జె. రమేష్



జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ జె. రమేష్

ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

ఎస్పీ కెకెఎన్. అన్బురాజన్


ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌కు బొకే అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమిష్టిగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆదివారం జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులతో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారదర్శక, నిష్పక్షపాతంగా పని చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, బాడీలీ అఫెన్స్, దొంగతనాలు వంటి వాటిపై ప్రాధాన్యతా క్రమాన్ని గుర్తించి నివారించాలన్నారు. జిల్లాలో మట్కా, పేకాట ఉండకూడదన్నారు. సిబ్బంది అవినీతికి దూరంగా ఉండాలన్నారు. కీలక కేసులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వేగవంతంగా ట్రయల్స్ జరిపించి నిందితులకు శిక్షలు పడేందుకు కృషి చేయాలని సూచించారు. దీనికి డీఎస్పీల మానిటరింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. డయల్ 100కి వచ్చే కాల్స్‌పై వేగవంతంగా స్పందన ఉండాలన్నారు. నిర్ణీత సమయంలో నేర స్థలానికి చేరుకుని బాధితులకు ఊరట కల్పించాలన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లను సందర్శిస్తానన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, గంజాయి కేసుల్లోని నిందితుల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీసుస్టేషన్లకు వచ్చే మహిళలు, ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. ఇకపోతే ప్రస్తుతం జరుగుతున్న వినాయక చవితి పండుగ, నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఏ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు బి.శ్రీనివాసులు, సీఎం గంగయ్య, యు.నరసింగప్ప, జి.ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికీ విఘ్నాలు తొలగి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి కుటుంబం, సుఖసంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని అభిలషించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను పలువురు పోలీసులు అధికారులు కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఏ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు బి.శ్రీనివాసులు, సిఎం గంగయ్య, యు.నరసింగప్ప, జి.ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, ఎస్బీ సీఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర , డీసీఆర్బీ సీఐ విశ్వనాథ్ చౌదరి, లీగల్ అడ్వైసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్బీ సీసీ ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, శివప్రసాద్, సరోజ తదితరులు ఉన్నారు.


మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

2024లో గెలుపే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

2024లో గెలుపే లక్ష్యంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు నూతనంగా ఎంపికైన పార్టీ అధ్యక్షులు, నాయకులు ఆదివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని నివాసంలో కలిశారు. ఇందులో భాగంగా శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సంద్బంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గం వైసిపికి కంచుకోట అన్నారు. ఆ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత అజెండాలు, విభేదాలను పక్కన పెట్టి ఉరవకొండలో వైసిపి జెండా ఎగరవేయడమే మన ముందున్న లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, రూరల్ అధ్యక్షుడు ముష్టూరు సుంకన్న, కూడేరు అధ్యక్షుడు బైరెడ్డి రామచంద్రారెడ్డి, వజ్రకరూరు అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, విడపనకల్లు మండల అధ్యక్షుడు బసన్న, బెలుగుప్ప మండల అధ్యక్షుడు మచ్చన్న, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, నాయకులు తేజోనాథ్, అశోక్‌కుమార్, జోగి వెంకటేష్, భరత్‌రెడ్డి, ఉస్మాన్, ఓబన్న, శ్రీనివాసులు, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బావిలో పడి వృద్ధుడు మృతి


మృతిచెందిన లక్ష్మారెడ్డి

పుట్లూరు : ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గరుగుచింతపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాల మేరకు.. గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి (72) పని నిమిత్తం తోటకు వెళ్లాడు. అయితే బావి పక్కన గడ్డి ఏపుగా ఉండడంతో తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడు. దీంతో నీటిలో మునిగి మృతి చెందాడు. కొడుకు నారాయణరెడ్డి తన తండ్రికి అన్నం తీసుకుని తోటకు వచ్చాడు. అయితే తోటలో ఎటు చూసినా తండ్రి కనిపించలేదు. ఈనేపథ్యంలో బావిలోకి తొంగి చూడగా చెప్పులు నీటిపై తేలియాడుతూ కనిపించాయి. దీంతో చుట్టుపక్కల వారిని తీసుకెళ్లి బావిలో వెతకగా నారాయణరెడ్డి శవమై కనిపించాడు. దీంతో బోరున విలపించాడు.

యువకుడు ఆత్మహత్య


మృతిచెందిన శివారెడ్డి

నార్పల : మండల పరిధిలోని దుగుమర్రి గ్రామానికి చెందిన లింగారెడ్డి కుమారుడు శివారెడ్డి (25) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివారెడ్డికి ఇంట్లోవారు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎన్ని సంబంధాలు చూసినా కుదరకపోవడంతో మనస్థాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమణించిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి లింగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులోని చెరువు కట్ట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కోజ్జేపల్లి గ్రామానికి చెందిన మునీంద్ర వ్యక్తి పని నిమిత్తం గుత్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. చెరువుకట్ట వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బసినేపల్లి రామచంద్రారెడ్డి మృతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం గుత్తి మండల కమిటీ సీనియర్ నాయకులు, బసినేపల్లి గ్రామం మాజీ సర్పంచి రామచంద్రారెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతిపై సిపిఎం జిల్లా కమిటీ ప్రగాడ సంతాపాన్ని తెలిపింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డితో అనుబంధాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గుర్తు చేసుకున్నారు. కాగా రామచంద్రారెడ్డి అంత్యక్రియలు సోమవారం బసినేపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గుత్తి మండలంలో సిపిఎంకు బలమైన కేంద్రంగా బసినేపల్లి గ్రామం ఉండేదన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన పిలుపులో భాగంగా సిపిఎంలో అత్యధిక మంది తరిమెల నాగిరెడ్డి వైపు వెళ్లినప్పటికి బసినేపల్లి, బేతాపల్లి, చెట్నేపల్లి, గుత్తి, ప్రాంతాల్లో సిపిఎం వైపు నిలపబడంలో హంపిరెడ్డి విశేషకృషి చేశారన్నారు. ఆయనకు యువనాయుడిగా రామచంద్రారెడ్డి తోడుగా ఉంటూ సిపిఎం అభివృద్ధికి సహాయపడ్డారని గుర్తు చేశారు. 17 సంవత్సరాలు బసినేపల్లి గ్రామానికి హంపిరెడ్డి సిపిఎం సర్పంచ్‌గా ఉండగా మరో 10 సంవత్సరాలు రామచంద్రారెడ్డి సిపిఎం సర్పంచ్‌గా సేవలు అందించారని తెలిపారు. నిజాయితి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా చివరి వరకు కొనసాగిన రామచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు.

నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

కొనసాగిన టిడిపి దీక్షలు..ఆందోళనలు


అనంతపురంలో దీక్షలు చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ.. ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపి నిరంకుశ పాలన సాగిస్తున్న సిఎం జగన్ వంటి నియంతతో పోరాడుతున్నామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. వీరి దీక్షలకు జనసేన జిల్లా నేతలు మదతు తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాదులంతా ఏకం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి, ముఖ్యమంత్రి జగన్ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. జనసేన నాయకులు జయరాం, భవాని రవికుమార్ మాట్లాడుతూ ఈ సైకో జగన్‌పై పోరాటానికి టిడిపితో కలిసి నడుస్తామన్నారు. ఆ దీక్షల్లో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మార్కెట్ మహేష్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఉమామహేష్, బొమ్మినేని శివ, మనోహర్, సున్నం శ్రీనివాసులు, దూదేకుల రఫీ, సురేంద్ర, రంగయ్య, సీనా నాయక్, నాగన్న, గంగవరం బుజ్జి పాల్గొన్నారు.

శింగనమల : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రజలంతా వైసిపి అరాచకాలను గమణిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నారసానాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, నాయకులు హనుమంతు, బాబు, రామంజి, మేడకుర్తి రామకృష్ణారెడ్డి, సత్తా శివారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, మాసూలు చంద్రమోహన్, ఎం.ఆదినారాయణ, కొయ్యగూర పెద్దన్న, బండి వెంకటనారాయణ, కాయల సురేష్, చిన్నజలాలపురం ఎర్రిస్వామి, చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అక్రమ అరెస్టులతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవాలనుకోవడం వైసిపి మూర్ఖత్వమని బెలుగుప్ప టిడిపి నాయకులు అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన బెలుగుప్ప మండలం టిడిపి నాయకులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా కళ్లకు నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకుని నిరసన తెలిపారు. వీరికి జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ప్రసాద్, తిప్పయ్య, రాధాకృష్ణ, ఆనందప్ప, నారాయణస్వామి, సర్పంచులు నాయుడు, రాము, జీడిపల్లి నాయుడు, పురుషోత్తమరెడ్డి, వెంకటరామిరెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దోచుకుంటే.. జగన్ పంచుతున్నాడు..

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం

గత టిడిపి హయాంలో చంద్రబాబు దోచుకుని దాచుకుంటే.. వైఎస్ జగన్ సిఎం అయ్యాక వివిధ సంక్షేమ పథకాల పేర పంచిపెడుతున్నాడని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు వైసిపి ప్రభుత్వం వల్ల కల్గిన లబ్ధిని వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూశారు... ఏ ప్రభుత్వంలోనైనా నేరుగా సంక్షేమ పథకాల డబ్బులు ఖాతాల్లో పడ్డాయా.. ఏ ముఖ్యమంత్రి మంచి పనులు చేశారో ప్రజలు గమణించాలి' అని కోరారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకూ నేరుగా ఖాతాల్లో జమైందన్నారు. పేదల గుండె చప్పుడు సిఎం జగన్ అన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత వివిధ పథకాల ద్వారా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు సంపదను దోచుకుంటే జగనన్న మాత్రం ప్రజలకు సంపదను పంచి పెడుతున్నాడని గుర్తు చేశారు. అనంతరం కందుకూరులో పూర్తయిన సచివాలయం 1, 2 భవనాలతోపాటు రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రం భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ప్రశాంత్‌కుమార్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లింగమయ్య, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ వల్లే చేతివృత్తుల అభివృద్ధి : జెసి కేతన్‌గార్గ్


పూజలు చేస్తున్న జెసి కేతన్‌గార్గ్, ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విశ్వకర్మ వల్లే చేతివృత్తులు అభివృద్ధి చెందాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. ఆదివారం నగరంలోని పాతూరు బ్రహ్మంగారి గుడిలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కత్తి, సుత్తి, కొడవలి లాంటి చేతి వత్తుల పరికరాలు విశ్వకర్మ తయారు చేశారని గుర్తు చేశారు. అంతేగాకుండా ఎన్నో దేవతా విగ్రహాలకు రూపాన్ని ప్రపంచానికి విశ్వకర్మ ఇచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివత్తుల వారికి ఉపాధి కల్పిస్తున్నారని, వారి కోసం అనేక రకాల పథకాల ప్రవేశపెట్టి వారిని ప్రోత్సహిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, డిసిసిబి ఛైర్ పర్సన్ లిఖిత, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఆర్టీసీ రీజనల్ డైరెక్టర్ మంజుల, వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ రిజ్వాన్, బిసి కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, బిసి వెల్ఫేర్ డిడి ఖుషఌ కొఠారి, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, ప్రముఖ న్యాయవాది గురు ప్రసాద్, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి నాగభూషణం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ మానికింద లిఖిత, ఎపిఎస్ ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మంజుల, సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జిలు బీసీ రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, బోయ రాజారాం, అనుబంధ విభాగల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ రిజ్వాన్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసులు, కార్పొరేటర్లు జనబలం బాబా ఫక్రుద్దీన్, కమల్‌భూషణ్, మాజీ కార్పొరేటర్ బంగి సుదర్శన్, అనిల్‌గౌడ్, మహిళా నాయకురాలు కృష్ణవేణి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలోని కంసలి వీధిలో ఉన్న కాళికాంబ దేవస్థానంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్వకర్మ చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి కాళికాంబ ఆలయం నుంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కె.నాగరాజు, గౌరవాధ్యక్షులు తిప్పేస్వామి, బిఎస్ ఓంకార్‌ఆచారి, విశ్వకర్మ మహిళా జేఏసీ అధ్యక్షురాలు కె.సంధ్యారాణి, గౌరవాధ్యక్షురాలు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే వాడుదాం

బొమ్మనహాల్ : మండల ప్రజలు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు ఎక్కువ డబ్బులు పెట్టి తీసుకొచ్చే రంగురంగుల వినాయకుల కారణంగా వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కావున ప్రజలు మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు.

ఊటీలో ఏపి రెడ్డిసంఘం ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు : తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంఘం ఇంతస్థాయికి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డిసంఘం ద్వారా రెడ్ల ఐక్యత, హక్కుల సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు దండ ధర్మారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఎం.సురేంద్రారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు భరత్‌రెడ్డి, యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బండి దామోదర్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అనంతపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలందరూ ఆరోగ్యం గా ఉంటారని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ సూచించారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం 3వ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా క్యాంపైన్‌లో భాగంగా ఆదివారం స్థానిక శిల్పా హాస్టల్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థినులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవాసమితి 3వ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ జి.మమత, ఇన్‌ఛార్జి అఫ్ గర్ల్స్ హాస్టల్స్ కె.మాధవి, బి.జోజిరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

డాక్టర్. తస్విన్‌కౌర్‌కు ఐఎస్ఎఆర్ యూత్ ఐకాన్ అవార్డు


ఐఎస్ఎఆర్ యూత్ ఐకాన్ అవార్డును అందుకుంటున్న డాక్టర్ తస్విన్ కౌర్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని చంద్ర ఆసుపత్రి మాత్రికాస్ ఫెర్టిలిటీ సెంటర్ వైద్యులు డాక్టర్ తస్విన్ కౌర్‌ను ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఎఆర్ యూత్ ఐకాన్ జాతీయ అవార్డు వరించింది. ఈమేరకు కేరళలోని కొచ్చిన్ లీ మెరిడియన్ హోటల్లో ఐఎస్ఎఆర్ అధ్యక్షురాలు డాక్టర్ నందితా పాల్ట్‌షేకర్ అవార్డును అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందితా పాల్ట్‌షేకర్ మాట్లాడుతూ ఐఎస్ఎఆర్ ద్వారా పునరుత్పత్తి వైద్యంలో స్త్రీ ఆరోగ్యం పట్ల నిబద్ధత, చైతన్యం, సహకారం అందించినందుకు తస్విన్ కౌర్‌కు అవార్డు లభించిందన్నారు. అనంతపురం వంటి చిన్న పట్టణంలో పునరుత్పత్తి సేవలను తీసుకురావడం అభినందించదగ్గ విషమన్నారు. ఆమె అందిస్తున్న సేవలు మెట్రోలు, నగరాలకు సమానమన్నారు. వంధ్యత్వానికి సంబంధించిన వివిధ పాఠ్య పుస్తకాలు, జర్నల్‌లలో 15 కంటే ఎక్కువ ప్రచురణలు ఉన్నాయన్నారు. డాక్టర్ తస్విన్ కౌర్ మాట్లాడుతూ ఆధునిక వైద్యాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సంతాన ఉత్పత్తి లేదని బాధపడే వారికి నూతన పద్ధతుల ద్వారా సంతాన ఉత్పత్తి అవకాశాలు కల్పించేందుకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఈ అవార్డు లభించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. తశ్విన్‌కౌర్‌కు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డు లభించడం పట్ల అనంతపురం ఉమ్మడి జిల్లాల వైద్యులు ఇతర ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనసేన బలోపేతానికి సైనికుల్లా పనిచేద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

జనసేన పార్టీని బలోపేతం చేయడంతోపాటు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండలోని జనసేన కార్యాలయంలో కార్యకర్తలకు సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామన్నారు. కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్యులకు ఏదైనా జరిగితే ఆర్థికంగా అండగా ఉండేలా క్రియాశీలక సభ్యత్వం ఉంటుందన్నారు. జిల్లాలో గడిచిన రెండేళ్లలో ప్రమాదానికి గురైన కార్యకర్తలకు రూ.50వేలు, ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షలు ఆర్థికసాయం అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. కావున మనవంతుగా ఆ దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు, బెలుగుప్ప మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, గోపాల్, కేశవ, సుధీర్, నాయకులు దేవేంద్ర, రాజేష్, రమేష్, మధు, శేఖర్, సూర్యానాయక్, రూపేష్, బోగేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లె రఘునాథరెడ్డి పుట్టినరోజు వేడుకలు రద్దు

ప్రజాశక్తి-అనంతపురం

మాజీమంత్రి, శ్రీ బాలాజీ విద్యాసంస్థల కరస్పాండెంట్ పల్లె రఘునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించకూడదని నిర్ణయించారు. టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. తన అభిమానులు, శ్రేయోభిలాషులు ఈ విషయాన్ని గమణించి చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనల్లో పాల్గొనాలని కోరారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ


అనంతలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ఆపార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ ఆధ్వర్యంలో మట్టి గణపయ్యలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బాబురావు, ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, అంజి, రాజేష్ కన్నా, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్, వీరమహిళలు అనసూయ, దాసరి సహిత, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న హరిహర లలితా పరమేశ్వరి దేవాలయం వద్ద ఆదివారం ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేసినట్లు వాసవీ రక్తదాతల సంస్థ సభ్యులు నూకల నవీన్ కుమార్ తెలిపారు. దాదాపు 8ఏళ్ల నుంచి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ రక్తదాతల సంస్థ సభ్యులు జూటూరు మహేష్, శ్రీకాంత్, శ్రీధర్, కోవూరు సుకుమార్, విజయ్‌సాయి, రక్తదాతలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని సన్‌రైజర్స్ పాఠశాలలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలతోపాటు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, పాఠశాల కరస్పాండెంట్ మారెన్న మాట్లాడుతూ వినాయక చవితి పండుగ రోజు పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ఎంతో శ్రేయస్కరమన్నారు. అందుకోసమే మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ జయవర్ధన్, విశ్రాంత ఉపాధ్యాయుడు పర్వతన్న, ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, నాగవేణి, రషీదా, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేతలకు అభినందన

అనంతపురం : నగరంలోని మాసినేని గ్రాండ్ హోటల్‌లో ఫర్ ది సొసైటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రూప్-1 విజేతలకు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పోతుల రాధాకృష్ణ, నంద్యాల అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి అభ్యర్థులకు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యమన్నారు. అంతేగాకుండా నిరంతర అధ్యయనం, సమాంతరమైన పరిశీలన ఉండాలన్నారు. గ్రూప్-1 విజేతలను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రూప్-1 సాధించిన అభ్యర్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య, వాడ్రేవు చిన వీరభద్రుడు, ఎస్‌కెయు తెలుగు విభాగం ప్రొఫెసర్ సదాశివరెడ్డి, నార్పల తహశీల్దార్ హరికుమార్, కొత్తపల్లి సురేష్, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వరప్రసాద్, గ్రూప్-1 విజేతలు శ్రీరామచంద్ర, జ్ఞానానందరెడ్డి, చేగువేరా హరి, కోటిగారి వన్నప్ప, బిల్లా వెంకటేష్, హరికృష్ణ, అనిల్‌కుమార్, కుమార్ రాజా, సిరాజ్ మలోబులు, శెట్టూరు రవి, గంగవరం గోవిందు, బాబా ఫక్రుద్దీన్, టిఎన్ఎస్ఎఫ్ లోకేష్, గోసల నారాయణస్వామి, డాక్టర్ జన్నే ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్..నోరు అదుపులో పెట్టుకో...

అనంతపురం : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం అనంతపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ పార్ట్ టైం రాజకీయాలు చేస్తూ వారాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌కి వస్తూ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. టిడిపితో లోపాయకారి ఒప్పందం పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌ని సర్వనాశనం చేశాడన్నారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌ని విభజిస్తున్నప్పుడు నోరు మూసుకుని కూర్చోవడంతోపాటు బీజేపీ, టీడీపీతో అధికారాన్ని పంచుకున్నారన్నారు. అలాగే ఓటుకు నోటు కేసులో అప్పటి సిఎం చంద్రబాబు పదేళ్ల ఉమ్మడి రాష్ట్రాలకు రాజధాని అయిన హైదరాబాద్‌ను వదిలేసి వచ్చినప్పుడు ఎక్కడికి వెళ్లాడని ప్రశ్నించారు. ఇప్పుడు రూ.కోట్ల డబ్బులు అవినీతి చేసి సాక్షాధారాలతో నిరూపించి చంద్రబాబును జైలుకి పంపితే పవన్‌కళ్యాణ్ నిస్సిగ్గుగా జైలులో కలిసి రహస్య స్నేహాన్ని బహిరంగ పరుస్తూ పొత్తుపెట్టుకుని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు పూనుకున్నారన్నారు. పేద, సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం నిత్యం ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నోటికొచ్చినట్లు దుర్భాషలాడటం మంచి పద్ధతి కాదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉపాధి ఇవ్వకపోగా వారిపేరుతో డబ్బులని దోచుకున్న కేసులో చంద్రబాబు అరెస్టు అయితే ఆయనకు మద్దతుగా పవన్ కళ్యాణ్ నోటికొచ్చినట్లు మాట్లాడటం పద్ధతి కాదన్నారు.